క్లుప్తంగా

మొక్కలు నాటి సంరక్షించండి : సీఐ



మొక్క నాటుతున్న సీఐ వెంకట్ రాజాగౌడ్

రామాయంపేట(మెదక్): మానవ మనుగడకు మొక్కలే ఆధారమని, ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని సీఐ వెంకట్ రాజగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని పాండచెరువు కట్టపై కొలువైన నాగులమ్మ ఆలయం వద్ద సీఐ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అందరూ మొక్కలు నాటి, సంరక్షించాలని సూచించారు. ఆహ్లాద వాతావరణంలో ఆలయం ఉందని, వన మహోత్సవంలో భాగంగా మరిన్ని మొక్కలు నాటాలని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కోటి సత్యనారాయణరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధి దామోదర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ బంధువులతో గ్రామంలో పురాతన కోదండరామ స్వామి ఆలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందువులు అందరూ సంఘటితం కావాలని అన్నారు. సమాజంలో ప్రతీ ఒక్కరూ శాంతి సామరస్యంతో, భక్తిభావాలతో ఉండాలని తెలిపారు.

భారీవర్షంతో దెబ్బతిన్న మొక్కజొన్న పంట



మక్కరాజీపేటలో నేలవాలిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు శ్రీశైలం

చేగుంట(తూప్రాన్): మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. 15 రోజుల్లో చేతికొచ్చే పంటలు నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మక్కరాజీపేట గ్రామంలో దాదాపు పది మంది రైతులకు చెందిన మొక్కజొన్నపంట నేలవాలింది. అధికారులు స్పందించి, తమ పంటలకు నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు పేర్కొన్నారు.

పేదలకు పండ్ల పంపిణీ



చేగుంటలో పేదలకు పండ్లు అందిస్తున్న లయన్స్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): లయన్స్ క్లబ్ గవర్నర్ నగేష్ జన్మదినం పురస్కరించుకొని చేగుంటలో పేదలకు పండ్ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చౌరస్తా, బస్టాండ్ పరిసరాల్లో పేదలకు పండ్లను అందజేశారు. లయన్స్ కార్యక్రమంలో సతీష్, లింగమూర్తి, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పత్తి సాగు



రామోజీపల్లి శివారులో సాగవుతున్న పత్తి పంట

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పత్తి పంట ఆశాజనకంగా ఉంది. రైతులు సాగుచేసిన పత్తి పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట బాగా ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. మండలంలో ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో రైతులకు ఇబ్బందులు దూరమయ్యే అవకాశం ఉంది.

చిత్తడిగా మారిన రహదారులు

అధ్వానంగా శేరిపల్లి రైల్వేస్టేషన్ రోడ్డు • ఆందోళనలో ప్రయాణికులు

చిన్నశంకరంపేట(మెదక్): చినుకు పడితే చాలు చిత్తడిగా మారే రోడ్లు. ఎటూ చూసిన గుంతలు ఉండడంతో ఆ రహదారి గుండా వెళ్లలంటేనే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రహదారిపై నీరు నిలిచి బురదగా మారి.. గుంతలు కన్పించక ఏ గుంతలోకి వాహనం దిగబడిపోతుందో తెలియని పరిస్థితి. ఇది చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చే రహదారి దుస్థితి. రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. పట్టించుకునే నాథుడేలేరని నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శేరిపల్లి గ్రామం నుంచి చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చే రహదారి అధ్వానంగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలున్నాయి. ఇరవై ఏళ్లుగా ఎన్నికలొచ్చినప్పుడల్లా అభ్యర్థులు హామీ ఇస్తున్నప్పటికీ మట్టిరోడ్డును మాత్రం బీటీ రోడ్డుగా మార్చలేకపోతున్నారు. వర్షం వస్తే నీటి గుంతలతో అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీరోజు మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించే గ్రామస్తులు రాత్రి సమయంలో రైలు దిగి గ్రామంలోకి వచ్చేందుకు ఈ రోడ్డుపై వస్తుంటే చాలా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రైల్వేస్టేషన్ నుంచి గ్రామానికి వచ్చేందుకు ప్రధాన రహదారి మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మిర్జాపల్లిలో..

మండలంలోని మిర్జాపల్లి రైల్వేస్టేషన్ కాలనీలోని ప్రధాన రహదారి ప్రస్తుతం రోడ్డు ధ్వంసమైంది. దీంతో గుంతలు ఏర్పడి, మట్టి రోడ్డును తలపిస్తుంది. మిర్జాపల్లి రైల్వేస్టేషన్ నుంచి కామారం గిరిజన తండాకు వెళ్లే రహదారి కూడా అధ్వానంగా ఉంది. వర్షం వస్తే బురదతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): పెద్దగొట్టిముక్ల - గుమ్మడిదల రోడ్డు దుస్థితి



పెద్దశంకరంపేట(మెదక్): బుజరాన్‌పల్లిలో..

గుంతల రోడ్డుతో ఇక్కట్లు

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దగొట్టిముక్ల - గుమ్మడిదల ప్రధాన రహదారిపై పలుచోట్ల ఏర్పడిన భారీ గుంతల వల్ల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర ప్రయాణికులు అదుపుతప్పి కింద పడి గాయాలైన సంఘటన అనేకం చోటుచేసుకున్నాయి. సంబంధిత పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్పందించి, పాడైపోయిన రోడ్డుకు మర్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మరమ్మతులు చేయండి

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట నుంచి హనుమంతరావు పేట మీదుగా నారాయణఖేడ్ వెళ్లే దారిలో బుజ్రానిపల్లి గ్రామం వద్ద రహదారిపై గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. కొన్ని రోజులుగా రహదారిపై భారీ గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల స్పందించి గుంతలు పడ్డ రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



శేరిపల్లి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి



మిర్జాపల్లి రైల్వేస్టేషన్ ఎదురుగా రోడ్డు దుస్థితి

ఆస్పత్రిలో పేరుకుపోయిన చెత్త

నర్సాపూర్: పట్టణ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చెత్త పేరుకుపోయింది. మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో చెత్తను తీసుకువెళ్లనందున చెత్త రోజురోజుకూ పేరుకుపోతుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్పత్రిలో వచ్చే చెత్తను ఆస్పత్రి ఆవరణలోని ఖాళీగా ఉన్న క్వార్టర్ల పక్కన వేస్తే, దానిని మున్సిపాలిటీ సిబ్బంది గతంలో వచ్చి తీసుకువెళ్లే వారన్నారు. కానీ ఇటీవల వారు రాకపోవడంతో చెత్త అలాగే ఉంటుందని చెప్పారు. చెత్త పేరుకుపోయి కుళ్లి పోవడంతో దుర్వాసన రావడంతో పాటు దోమలు ప్రబలుతున్నాయని వాపోయారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మిర్జానజీం బేగ్‌ను వివరణ కోరగా... ఆస్పత్రిలో వచ్చే చెత్తను రోజు తీసుకువెళ్లాలని మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు చెప్పినా.. ప్రయోజనం లేదన్నారు. మున్సిపాలిటీ సిబ్బంది రానందున చెత్త పేరుకుపోయిందని ఆయన చెప్పారు.



నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పేరుకుపోయిన చెత్త



కల్యాణోత్సవం తిలకిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, భక్తులు

వైభవంగా రాజరాజేశ్వరి కల్యాణోత్సవం

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పట్టణంలోని ప్రాచీన దేవాలయమైన రాజరాజేశ్వరి దేవాలయంలో ఆదివారం శ్రావణమాస పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మహాన్యాసంతో శత రుద్రాభిషేకం, శత గటాభిషేకంతో సహా లక్ష బిల్వార్చన, కుంకుమార్చన, కల్యాణోత్సవం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే లలిత సహస్ర పారాయణం చేశారు. పాడి, పంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డిలు వేర్వేరుగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనులపండువగా బోనాల ఊరేగింపు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పోతులబోగూడ గ్రామంలో ఆదివారం బోనాల పండుగ మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి, బోనాలు, బండ్లు ఊరేగించారు.

యావపూర్‌లో..

తూప్రాన్: మండలంలోని యావపూర్ గ్రామంలో బోనాల జాతర నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, బ్యాండ్ మేళాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): బోనాల ఊరేగింపులో భక్తులు



తూప్రాన్: యావపూర్‌లో బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఉదయం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్ నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కుంకుమార్చన చేయించారు. బోనాలు తీసి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద డప్పు చప్పుడు శివసత్తుల పూనకాలు అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులు తలనీలాలు సమర్పించి, వాహనాలకు పూజలు చేయించారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం వితరణ చేశామన్నారు.

కృష్ణాష్టమికి ముస్తాబైన మందిరం



కౌడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు



చిన్నశంకరంపేటలో ముస్తాబైన కృష్ణ మందిరం

యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు

చిన్నశంకరంపేట(మెదక్): కృష్ణాష్టమి వేడుకలకు మండల కేంద్రంలోని కృష్ణ మందిరం ముస్తాబైంది. సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం ధ్వజారోహనం, గోమాత సంకీర్తన ర్యాలీ, గోపూజ, స్వామివారికి అభిషేకం, పూజలు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం, ఉట్టి కొట్టుట చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పూలపల్లి యాదగిరి యాదవ్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు రాములు యాదవ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాలకు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని నాల్గవ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు ముందుస్తుగా ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ రజియాసుల్తాన కేంద్రానికి వచ్చే చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ వేసి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసీ చైర్మన్ జగన్, పాండు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లలు పంపిణీ చేయాలి

కౌడిపల్లి(నర్సాపూర్): మత్స్య సహకార సంఘాలకు ప్రభుత్వం వెంటనే ఉచిత చేపపిల్లలను పంపిణీ చేయాలని మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సున్నం సతీష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ముట్రాజ్‌పల్లిలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సమావేశాన్ని చైర్మన్ రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. మత్స్యసహకార సంఘాలకు ప్రభుత్వం ప్రతీ ఏడాది చెరువు, కుంటల్లో చేపపిల్లలు పెంచేందుకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందని చెప్పారు. కాగా ప్రస్తుతం ఇంకా చేప పిల్లలను పంపిణీ చేయలేదని, త్వరగా పంపిణీ చేయాలన్నారు. దీంతోపాటు మత్స్యసహకార సంఘాలకు సొంత భవనాలు మంజూరు చేయాలన్నారు. మత్స్యకారులకు కులవృత్తికోసం వంద శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలన్నారు.



మాట్లాడుతున్న సతీష్

ఎమ్మెల్యే పరామర్శ

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో మాజీ జెడ్పీటీసీ భర్త, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ దశదినకర్మకు ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై ఘన నివాళులర్పించారు. అదేవిధంగా ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన మండలంలోని యశ్వంతరావ్‌పేటలో పెంటయ్య, మానెపల్లిలో మాజీ ఉప సర్పంచ్ ఎల్లం, ఆశం పెంటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు భూపాల్‌రెడ్డి, కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సోమప్ప, అశోక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



వెల్దుర్తిలో లక్ష్మిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

భక్తిశ్రద్ధలతో సరస్వతీ హోమం

చేగుంట(తూప్రాన్): మండలంలోని బోనాల్ గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇమ్మడి లక్ష్మణ్ ఆధ్వర్యంలో సరస్వతీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసి, హోమం పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరస్వతీ సేవ సమితి ఆధ్వర్యంలో 494వ సరస్వతీ హోమం బోనాల్ గ్రామంలో జరిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యామనోహరశర్మ, విద్యాసాగరశర్మ, విద్యాచరణ్ శర్మ, శ్రీధర్‌శర్మ, నాగరాజుశర్మ పూజలను నిర్వహించగా, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

సంక్షిప్త వార్తలు

◆ **నేడు నవగ్రహ ఆలయం 42వ వార్షికోత్సవం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీరాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని నవగ్రహ దేవాలయం 42వ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తామని ఆలయ భజన మండలి సభ్యులు ఆదివారం తెలిపారు. ఆ రోజుల ఉదయం దేవతామూర్తులకు జరిగే ప్రత్యేక పూజలు, హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ **వెలగని హైమాస్ట్ లైట్లు**

కౌడిపల్లి(నర్సాపూర్): హైవేపై హైమాస్ట్‌లైట్లు వెలగడం లేదు. నెలలు గడుస్తున్నా.. ఎవరు పట్టించుకోక పోవడంతో అంధకారం నెలకొంది. మండల కేంద్రం కౌడిపల్లిలో 765డి జాతీయ రహదారి మధ్యలో డివైడర్‌పై కిలోమీటర్ మేర హైమాస్ట్‌లైట్లు ఉన్నాయి. నాలుగు నెలలుగా లైట్లు వెలగడంలేదు. పక్షం రోజుల క్రితం ఒకసారి మరమ్మతులు చేసినా.. రెండురోజులు వెలిగి తర్వాత బంద్ అయ్యాయి. దీంతో రాత్రివేళలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

◆ **మహిళకు గాయాలు**

నర్సాపూర్: బస్సు ఎక్కుతుండగానే బస్సును ముందుకు కదిలించడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సాపూర్‌కు చెందిన పర్వీన్ సుల్తానా ఆదివారం మధ్యాహ్నం ఎస్‌బీఐ బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా బస్సు డ్రైవర్ బస్సును ముందుకు కదిలించాడు. దీంతో ఆమె కిందపడడంతో ఆమె తలకు తీవ్ర గాయమైందని ఆమె కుటుంబీకులు తెలిపారు. మహిళ బస్సు ఎక్కుతుండగానే బస్సును ముందుకు తీసుకుపోయిన బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

◆ **రత్నపూర్‌లో ఉచిత వైద్య శిబిరం**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని రత్నపూర్‌లో రామకృష్ణ మఠం సేవాసమితి దోమలగూడ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని రామకృష్ణ సేవాసమితి ప్రతినిధి వేణు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

◆ **వేలాది ధార్మిక సంస్థల వేదిక 'వీహెచ్‌పీ'**

మెదక్ మున్సిపాలిటీ: విశ్వవ్యాప్తంగా ఉన్న వేలాది ధార్మిక సంస్థల ఏకైక వేదిక విశ్వహిందూ పరిషత్ అని వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మాల సత్యంజీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1964లో శ్రీకృష్ణ జయంతి రోజున ప్రారంభమై 100కు పైగా దేశాలకు విస్తరించి లక్షలాది కార్యకర్తలను కలిగిన సంస్థ అని కొనియాడారు. కార్యక్రమంలో సత్యనారాయణ, నారాయణ, శరన్న శారద జీ, మల్లేశం, అరవిందగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **జ్యోతిర్లింగాల ఆలయంలో లక్ష బిల్వార్చన**



పెద్దశంకరంపేట(మెదక్): పట్టణ శివారులోని జ్యోతిర్లింగాల ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని భక్తులు ఆదివారం స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారని ఆలయ అర్చకుడు రాజ్‌కుమార్ తెలిపారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ పేద ప్రజలకు వరం**

టేక్మాల్(మెదక్): సీఎంఆర్‌ఎఫ్ పథకం నిరుపేద ప్రజలకు వరంలాంటిదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మరమేశ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రం టేక్మాల్ చౌరస్తాలో ఆయా గ్రామాల లబ్ధిదారులకు చెందిన రూ.19,92,500 విలువ గల 66 చెక్కులను కాంగ్రెస్ రమేశ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **సన్మానం**

గజ్వేల్: మండలంలోని కొడకండ్లలో ఇటీవల స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన దూలం వెంకటయ్య, గజ్వేల్ వెంకట్‌కిరణ్‌లను టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరావు, రాంచంద్రం, శ్రీశైలం, ప్రభాకర్, రాము, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264